క్లుప్తంగా

మహాసభలను జయప్రదం చేయండి



ర్యాలీ చేస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

తిరుపతి కల్చరల్: ఈనెల 16, 17, 18వ తేదీలలో తిరుపతిలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం తిరుపతిలో ఐఎఫ్‌టీయూసీ నేతలు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నేతలు నాగేశ్వరరావు, జె.గంగాదేవి, ఆర్.రామ్మోహన్, పీడీఎస్‌యూ రాష్ట్ర నేత భూషణం, ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఎస్.మహర్షి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నేత కాకర్త అప్పారావు, ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు కళ, కవిత, నందిని, ఆటో యూనియన్ నేత మునికుమార్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు స్త్రీశక్తి భవనంలో జరుగుతుందని ఎంపీడీఓ దేవేంద్రబాబు తెలిపారు. బుధవారం చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

తిరుచానూరు సర్పంచ్‌కు కార్మికుల సత్కారం



సర్పంచ్ రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న పంచాయతీ కార్మికులు

తిరుచానూరు(చంద్రగిరి): చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారు తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి. అరకొర జీతాలతో అవస్థలు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో, ఆయన ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచనలతో పంచాయతీ కార్మికులకు వేతనాలను పెంచారు. ఈ సందర్భంగా బుధవారం పంచాయతీ కార్మికులు తిరుచానూరు సర్పంచ్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ ఎంపీటీఈలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలి

తిరుపతి కల్చరల్: దళితులకు కేటాయించిన రిజర్వుడు స్థానాల్లో మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలని రాయలసీమ మాదిగ రాజకీయ జేఏసీ అధ్యక్షుడు పీసీ.స్వామి డిమాండ్ చేశారు. బుధవారం బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో రాయలసీమ మాదిగ రాజకీయ జేఏసీ నేతల సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దళితులలోని అన్ని కులాలకు రాజకీయాలలో సముచిత ప్రాధాన్యత కల్పించాలని ఈ సందర్భంగా అన్ని పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తమ వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించిన పార్టీలకే తాము ఓట్లు వేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ మాదిగ రాజకీయ జేఏసీ ప్రధానకార్యదర్శి టి.దాస్, నల్లాని బాబు, బి.కుమార్, డి.రాజు, కె.జగదీష్, బాల సుబ్రమణ్యం, పి.బాబు, నీరజ పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

జగ్జీవన్ భవన్ సందర్శన



జగ్జీవన్‌రామ్ భవన్‌ను సందర్శిస్తున్న పులి సునీల్, సభ్యులు

తిరుపతి కల్చరల్: ఆర్‌సీ రోడ్డు సమీపంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌ను సోషియల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ బుధవారం సందర్శించారు. వీరికి భవన్ కమిటీ నేతలు ఘనంగా స్వాగతం పలికి ఆహ్వానించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో బాబు జగ్జీవన్‌రామ్ భవనం నిర్మితమైంది. అయితే మొదటి దశ కొంత అసంపూర్తిగా నున్న భవన నిర్మాణం పనులను భవన్ కమిటీ నేతలు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి భవన నిర్మాణంలో భాగంగా కొంత అసంపూర్తిగా నున్న పనులను పూర్తిచేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భవన్ గౌరవాధ్యక్షుడు పూపాటి మోహన్ రాజ్, కమిటీ సభ్యులు యాశారపు వెంకటేష్, సురేష్, వినోద్, డాక్టర్ రవిబాబు, కారుమంచి చిరంజీవి, మునిశేఖర్ పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలబడదాం

- మేయర్ డాక్టర్ శిరీష



27వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, నేతలు

తిరుపతి తుడా: మహిళా సాధికారత, సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ప్రజలంతా జగనన్నకు అండగా నిలబడాల్సిన అవసరం ఉందని తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మేయర్ శిరీష 27వ డివిజన్‌లో బుధవారం ఇంటింటా పర్యటించారు. సంక్షేమం, అభివృద్ధి ఫలాలను వివరిస్తూ జగనన్నకు మద్దతు కూడగట్టారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మంచి పాలన కావాలంటే జగనన్నే మళ్లీ రావాలంటూ ప్రజల మద్దతుతో ప్రతి ఇంటికి జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను అతికించారు. బిడ్డలకు మంచి భవిష్యత్తు కావాలంటే జగనన్నను ముఖ్యమంత్రిగా మళ్లీ ఎన్నుకోవాలని మేయర్ శిరీష మహిళలకు వివరించారు. ముఖ్యమంత్రి జనరంజకంగా పాలన చేస్తున్నారన్నారు. పేదలంటే చీదరించుకునే ప్రతిపక్షాలన్నీ ఒక్కటై మన ముందుకు వచ్చే ప్రమాదం ఉందన్నారు. తిరుపతి నగరంలో ఎప్పుడు చూడని అభివృద్ధి జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే భూమన గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. తమ కౌన్సిల్ చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. భవిష్యత్తు తరాలు చెప్పుకునేలా రోడ్ల అభివృద్ధి జరుగుతోందన్నారు. తిరుపతిలో కూడళ్ల అభివృద్ధి, ఫ్రీలెఫ్టులు రోడ్ల విస్తరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నామన్నారు. గడిచిన 40ఏళ్లుగా ఎవరికి సాధ్యం కాని పనులు ప్రస్తుతం తిరుపతిలో శరవేగంగా పూర్తి చేసుకుంటున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు గోపాల్ రెడ్డి, భరణి యాదవ్, తులసి యాదవ్, ఈతమాకుల సురేష్, రమేష్, మధు, వెంకట ముని, గీతాయాదవ్, హేమలత, కార్యకర్తలు, వార్డు కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే మళ్లీ గెలిపిస్తాయి

చంద్రగిరి: పేద బడుగుబలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలే 2024 ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తాయని ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండల వ్యాప్తంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఇంటి యజమాని అనుమతితో నువ్వే మా నమ్మకం జగన్ స్టిక్కర్లను అంటించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని రీతిలో సంక్షేమ పథకాలను వెల్లువలా అర్హులకు అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రగిరి నుంచి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అసెంబ్లీకి పంపించి జగనన్నకు కానుకగా అందిస్తామని ఆయన తెలిపారు. సచివాలయ, గృహసారథుల మండల కన్వీనర్ సీఎం కేశవులు, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అగరాల దేవారెడ్డి, పసల నాగరాజు, నరసింగాపురం సర్పంచ్ చెంచురత్నం శెట్టి, కోలా అనిల్, మించల ప్రవీణ్, కొత్తపాటి కోటి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు

పాకాల: స్థానిక పూరిపేట, భారతంమిట్టలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు నిర్వహించారు. బుధవారం నేతలు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే జగనన్న స్టిక్కర్లను అనుమతితో ప్రతి ఇంటికి అంటించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మునీర్, టౌన్ కన్వీనర్ ఖాదర్‌వల్లీ, బేటా, రహమతుల్లా, రాజేష్ పాల్గొన్నారు.

భాకరాపేటలో..

భాకరాపేట: జంగావాండ్లపల్లె, రంగన్నగారిగడ్డ, దీన్నార్లపల్లె, భాకరాపేట, తిప్పిరెడ్డిగారి పల్లె, నెల్లుట్లవారిపల్లెలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. మండల గృహసారథుల కన్వీనర్ ఖదీర్ అహ్మద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కన్వీనర్లు పాల్గొన్నారు.



నరసింగాపురంలో నేతలు



పాకాలలో నేతలు



భాకరాపేటలో..

మాతృభాషకు సేవ చేస్తున్నా!

- శ్రీవారి సేవలో తెలుగు–సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి



తిరుమల ఆలయం వెలుపల లక్ష్మీపార్వతి



తిరుమల ఆలయం వెలుపల మంత్రి రోజా

తిరుమల: మాతృభాషకు సేవచేస్తున్నానని తెలుగు–సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి తెలిపారు. బుధవారం ఆమె తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని స్వామివారిని కోరుకున్నానని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా పరిపాలన సజావుగా సాగాలని, ప్రజలంతా చల్లగా ఉండాలని ప్రార్థించినట్టు చెప్పారు. తెలుగు–సంస్కృత అకాడమీలో మాతృభాషకు సేవ చేస్తున్నానని, ఎన్నికల్లో పోటీచేసే ఆలోచన లేదని చెప్పారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం మరికొందరు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మంత్రి ఆర్కే రోజా ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు. రోజా బుధవారం ఉదయం పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు.

వీధి విక్రయదారుల సమస్యలను పరిష్కరించండి



సమీక్ష నిర్వహిస్తున్న భూమన అభినయ్

తిరుపతి తుడా: వీధి విక్రయదారుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ ఆదేశించారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో డిప్యూటీ ముద్రనారాయణ, రెవెన్యూ ఆఫీసర్ కేఎల్ వర్మ, మెప్మా సిబ్బందితో కలిసి వీధి విక్రయదారుల సమస్యలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. వీధి విక్రయాలకు అనువైన ప్రదేశాల గుర్తించి సౌకర్యవంతంగా వ్యాపారాలు చేసుకునేందుకు సహకరించాలని సూచించారు. గుర్తింపు కార్డుల పంపిణీపై మరొకసారి సమీక్ష నిర్వహించి సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేయాలని అధికారులకు సూచించారు. మెప్మా సీఎం కృష్ణవేణి, అసోసియేషన్ నేతలు రాధాకృష్ణ, శివ పాల్గొన్నారు.

జగనన్న అంటే చాలా ఇష్టం



మొబైల్ ఫోన్లకు జగనన్న స్టిక్కర్ ను అంటించి చూపుతున్న మోహిత్‌రెడ్డి

భాకరాపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే చాలా ఇష్టమని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ఎర్రావారిపాలెం మండలం, చింతగుంట పంచాయతీలో బుధవారం గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమంలో జగనన్న నువ్వే మా భవిష్యత్తు అంటూ నినదించారు. మా నమ్మకం నువ్వే జగన్ అంటూ మోహిత్‌రెడ్డి బ్యాడ్జీలను చిన్నారి లక్ష్యత్ సాయికి, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ధరింపజేశారు. మోహిత్ రెడ్డి లక్ష్యత్ సాయిని ఎత్తుకుని ముచ్చటించారు. సీఎం వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను మొబైల్ ఫోన్లకు అతికించుకుని సంబరపడిపోయారు. ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చారు. మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశంతో ఐవీఆర్‌ఎస్ కాల్ రాగానే సంతోషం వ్యక్తం చేశారు.



మసీదులో ప్రార్థనలలో పాల్గొన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పవిత్రతకు ప్రతీక రంజాన్

భాకరాపేట: పవిత్రతకు ప్రతీక రంజాన్ మాసం అని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం తురకపల్లె మసీదులో ప్రార్థనలలో పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి విందు చేశారు.

అనుకున్న సమయానికే మాస్టర్‌ప్లాన్ రోడ్లు



సమీక్షిస్తున్న కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్

- కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి అభివృద్ధికి దిక్సూచిగా మారిన మాస్టర్‌ప్లాన్ రోడ్లు అనుకున్న సమయానికి అందుబాటులోకి తీసుకొస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత పేర్కొన్నారు. నగర విస్తరణ కనెక్టివిటీ పెంచడం ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడం అనివార్యం కావడంతో వేగవంతంగా పూర్తి చేసి మాస్టర్ రోడ్లను ప్రజలకు అంకితం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి మాస్టర్‌ప్లాన్ రోడ్లపై కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. మాస్టర్‌ప్లాన్ రోడ్ల ప్రగతిపై కమిషనర్ ఆరా తీశారు. వాటి పురోగతిని అడిగి తెలుసుకుని పూర్తిచేసేందుకు అవసరమైన పటిష్ట చర్యలు అమలు కావాల్సిందేనని అధికారులను ఆమె ఆదేశించారు. తిరుపతిలో పుట్టి పెరిగిన తనకు ట్రాఫిక్ సమస్య ప్రధానమని తెలుసన్నారు. అనతికాలంలోనే ఒకేసారి 14 మాస్టర్ రోడ్లను చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌కు 50 అడుగుల దూరం నుంచి తిరుపతి తూర్పువైపు అభివృద్ధి చెందకపోవడానికి ప్రధాన కారణం రోడ్లు లేకపోవడమేనని చెప్పారు. గత పాలకులు నగర అభివృద్ధిని, విస్తరణను, మౌలిక వసతుల కల్పనలను పూర్తిగా విస్మరించారన్నారు. ఆ పాపాలే ప్రస్తుతం ట్రాఫిక్ రద్దీతో ప్రజల్ని వేధిస్తున్నాయన్నారు. ఎప్పుడో జరగాల్సిన రోడ్ల అభివృద్ధిని తాము ఇప్పుడు చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. తిరుపతికి కనెక్టవిటీ పెంచడం, అభివృద్ధిని విస్తరించడమే లక్ష్యంగా మాస్టర్‌ప్లాన్ రోడ్లను ప్రతిష్టాత్మకంగా చేపట్టామన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన అన్నమయ్య, వైఎస్సార్, సామవాయి మార్గం మాస్టర్‌ప్లాన్ రోడ్లు అభివృద్ధికి దిక్సూచిగా నిలిచాయన్నారు. కొర్లకుంట మాస్టర్ రోడ్ల వల్ల ఆప్రాంతానికి అమాంతంగా విలువ పెరిగిందన్నారు. మేలో జరిగే గంగజాతర సమయానికి గంగమ్మ గుడి రోడ్డు, మాస్టర్ ప్లాన్ రోడ్డు అందుబాటులోకి తీసుకొచ్చితీరుతామన్నారు. అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్‌కుమార్, దేవిక, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి అందజేస్తున్న శోభనాద్రి

రామచంద్రాపురం: మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లి డీడబ్ల్యూ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు తిరుపతి ఎమ్మార్‌పల్లి కానిస్టేబుల్ శోభనాద్రి తన సొంత నిధులతో బుధవారం విద్యాసామగ్రి వితరణ చేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, తెలుగు, ఇంగ్లిష్ కాపీ రైటింగ్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుగుణ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో వైద్యులు, సిబ్బంది

తిరుపతి కల్చరల్: స్థానిక భవానినగర్‌లోని మదర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఐతేపల్లిలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి మధ్యాహ్న వరకు చేపట్టిన ఈ వైద్యశిబిరంలో 200 మంది పాల్గొన్నారు. వీరందరికీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మదర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ మదన్‌మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురికి రిమాండ్

తిరుపతి లీగల్: చోరీ కేసులో ముగ్గురికి ఈనెల 26వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పేరూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన డి.సునీల్, సాయినగర్ ఆంధ్రా బ్యాంక్ కాలనీకి చెందిన పి.గణేష్, బి.వెంకటకృష్ణ అలియాస్ వెంకి చింతలచేను రైల్వేగేట్ సమీపంలో ఖాళీస్థలంలో ఉంచిన వంద సెంట్రింగ్ షీట్స్‌ను వివిధ తేదీల్లో అపహరించారు. యజమాని ఫిర్యాదు మేరకు ఈస్టు పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

బీసీ జనగణన హర్షణీయం

- ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: బీసీల జనగణన చేపట్టి వారి అభ్యున్నతికి బాటలు వేయాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడం చారిత్రాత్మకమని, బీసీల పక్షపాతిగా నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి యావత్ బీసీలు రుణపడి ఉంటారని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో తమ జనాభా లెక్కలు చూపి తమ హక్కులను సమగ్ర స్థాయిలో అందించి ఆదరించాలని 75 ఏళ్లుగా బీసీలు పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నా స్పందన లేదని తెలిపారు. ఈ మేరకు బీసీలు అనేక పోరాటాలు చేసినా పట్టించుకున్న ప్రభుత్వం లేదని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు హామీలు ఇచ్చి బీసీల ఓట్లను దండుకుని తర్వాత పెడచెవిన పెట్టి హామీలను తుంగలో తొక్కాయని తెలిపారు. బీసీ బ్యాడ్జీలు తగిలించుకుని ఊరేగిన తెలుగుదేశం పార్టీ బీసీల ఆకాంక్షలను చిదిమేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిమందికి బీసీ నాయకులకు మంత్రి పదవుల ఇచ్చి వారిని షో బాయ్స్‌గా చూపిస్తూ మార్కెటింగ్ చేసుకుని బీసీలను మభ్యపెట్టి దగా చేసిందని పేర్కొన్నారు.

సెంట్రింగ్ షీట్స్ దొంగల ముఠా అరెస్ట్

- రూ.15 లక్షల సొత్తు స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- ఏఎస్పీ విమాల్‌కుమారి



వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ విమల్‌కుమారి

తిరుపతి క్రైమ్: జిల్లాలో భవన నిర్మాణాలు జరుగుతున్న స్థలంలో సెంట్రింగ్ షీట్స్ చోరీ చేస్తున్న ముఠాను మంగళవారం మధ్యాహ్నం రేణిగుంట రోడ్డులో అరెస్ట్ చేసినట్లు జిల్లా క్రైమ్ ఎస్పీ విమల్ కుమారి తెలిపారు. బుధవారం ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. తిరుపతిలోని వివిధ ప్రాంతాలకు చెందిన దాటి సునీల్(29), పిండి గణేష్(20), బైనపల్లి వెంకటకృష్ణ(19), మరో బాల నేరస్తుడు ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. బాలనేరస్తుడు తప్పించుకోగా, మిగతా వారందరినీ అరెస్టు చేసినట్లు తెలిపారు. ఏడు నెలలుగా కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టే వద్ద రెక్కీ నిర్వహించి, ఎవరు లేని సమయంలో సెంట్రింగ్ షీట్స్, పిల్లర్ బాక్స్‌లను ఈ ముఠా చోరీ చేసి బొలెరో వాహనంలో తరలించేదని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ముఠాపై 15 కేసులు ఉండడంతో సవాల్‌గా తీసుకుని ఛేదించినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.15 లక్షల విలువ చేసే పిల్లర్ బాక్సులు, సెంట్రింగ్ షీట్స్, జాకీరాడ్స్, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసును ఛేదించడంలో ఈస్ట్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ శివప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ నాగేంద్ర బాబు ఎంతగానో కృషిచేశారని అభినందిస్తూ రివార్డులు అందించారు.

రుయాలో రెండవ రోజూ కొనసాగిన విచారణ

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో ఇటీవల ఆరోగ్యశ్రీ ఆసరా నిధుల దోపిడీ వ్యవహారంపై విజిలెన్స్ తనిఖీలు బుధవారం రెండవ రోజూ కొనసాగాయి. ప్రభుత్వ ఈహెచ్‌ఎస్, మెడికల్ ఆడిటర్ డాక్టర్ టి.ఎస్.ఆర్ మూర్తి, ఆరోగ్యశ్రీ విజిలెన్స్ ఆఫీసర్ నరసింహారావు, జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కె.సునీతతో కూడిన ఆరుగురు బృందం విచారణలో పాల్గొన్నారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ నాగమునీంద్రుడును విచారణ బృందం సుదీర్ఘంగా విచారించింది. అలానే వివిధ విభాగాధిపతులు, వైద్యసిబ్బందిని రాత్రి 9 గంటల వరకు విచారించారు. రుయా పరిపాలన లోపాల కారణంగానే అక్రమాలు జరిగాయని విచారణ బృందం నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఏడాదిన్నరగా రుయా ఎలాంటి సంబంధంలేని వ్యక్తుల చేత ఏవిధంగా పనులు చేయించారని విచారణ బృందం గట్టిగా నిలదీసినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు గుర్తించకపోవడం ఏంటని, ఈ పాపంలో గత సూపరింటెండెంట్‌లు కూడా భాగస్వాములేనని అంచనాకు వచ్చారు. రుయాకు సంబంధంలేని వ్యక్తుల చేత పనులు చేయించడం వెనక అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ప్రశ్నించినట్లు అక్కడి వర్గాలు పేర్కొంటున్నాయి. రుయా అధికారుల బృంద విచారణ సమర్పించిన నివేదికపైన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సంబంధంలేని ముగ్గురు వ్యక్తులపైన ఆరోగ్యశ్రీ ఆసరా దోపిడీ వ్యవహారాన్ని నెట్టి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారని, ఈ నిర్లక్ష్యానికి కారకులైన విభాగాధిపతులు, సూపరింటెండెంట్, ఆరోగ్యశ్రీ పర్యవేక్షకుల పాత్ర ఏమిటని, తమకు ఇచ్చిన నివేదికలో ఈ అంశాలు ప్రస్తావించకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. మరింతలోతుగా విచారణ జరపాలని, గురువారం కూడా ఆసరా దోపిడీపై విచారణ జరపాలని విజిలెన్స్ బృందం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

పకడ్బందీగా విద్యుత్ భద్రతా చర్యలు

- ప్రమాదాల నివారణకు తప్పక సూచనలను పాటించండి
- విద్యుత్ సమస్యలపై 1912కు కాల్ చేయండి
- ఎలక్ట్రికల్ సేఫ్టీ రాష్ట్ర డైరెక్టర్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విజయలక్ష్మి

తిరుపతి రూరల్: విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి విద్యుత్ భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఎలక్ట్రికల్ సేఫ్టీ రాష్ట్ర డైరెక్టర్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి ఆదేశించారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ భద్రత–ప్రమాదాల నివారణ అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల నివారణపై వినియోగదారులకు అవగాహనను పెంపొందించేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేయాలన్నారు. గృహాల్లో విద్యుత్ వైరింగ్ కోసం నాణ్యమైన పరికరాలను వినియోగించాలని సూచించారు. ఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది స్తంభాలను ఏర్పాటు చేసే సందర్భాల్లో భద్రతా చర్యలను తప్పకుండా పాటించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే విద్యుత్ లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయడం, విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలను తొలగించడం చర్యల ద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు సుబ్బరాజు, శివప్రసాద రెడ్డి, సీపీడీసీఎల్ డైరెక్టర్ జయభారత్‌రావు మాట్లాడుతూ విద్యుత్ భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ భద్రతా అంశంపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు వీలుగా క్షేత్ర స్థాయిలో తరచూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా విద్యుత్ లైన్లు వేలాడుతుండడం, లైన్లు తెగిపోవడం, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం వంటి అంశాలను వినియోగదారులు గుర్తించినట్లయితే వెంటనే విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్లు చలపతి, గురవయ్య, అయూబ్ ఖాన్, సూపరింటెండింగ్ ఇంజినీర్లు కష్టారెడ్డి, మునిశంకరయ్య, ఉమాపతి, సురేంద్ర, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

స్విమ్స్‌లో మరింత మెరుగైన సేవలు

- టీటీడీ జేఈఓ సదాభార్గవి
- కార్పొరేషన్ ఉద్యోగులకు గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డులను అందజేస్తున్న జేఈఓ సదాభార్గవి

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన సేవలందించాలని టీటీడీ జేఈఓ సదా భార్గవి ఆదేశించారు. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్‌లో చేరిన స్విమ్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గుర్తింపు కార్డుల జారీని జేఈఓ ప్రారంభించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని జేఈఓ కార్యాలయంలో బుధవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన 25 మంది కార్పొరేషన్ ఉద్యోగులకు జేఈఓ గుర్తింపు కార్డులను అందజేశారు. జేఈఓ మాట్లాడుతూ స్విమ్స్‌లో పనిచేస్తున్న 1,800 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో కార్పొరేషన్‌లో విలీనం చేసినట్లు చెప్పారు. వీరికి ఆర్జిత సెలవులు వర్తింపచేశామని, ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణిస్తే రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కల్పించామని, గ్రాట్యుటీ చెల్లిస్తారని తెలియజేశారు. గుర్తింపుకార్డుతో సుపథం ద్వారా కుటుంబసమేతంగా శ్రీవారిని దర్శించుకునే అవకాశం కల్పించామని, రూ.20 చొప్పున నెలకు 10 లడ్డూలు సబ్సిడీపై పొందే అవకాశం ఇచ్చామని తెలియజేశారు. కార్పొరేషన్ సీఈఓ శేష శైలేంద్ర, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, జనరల్ మేనేజర్ ప్రసన్నలక్ష్మి, పీఆర్ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.